# సాక్షి గుంటూరు

ఆదివారం । 14 । జనవరి । 2024






### గోదాదేవికి సారె

తాడేపల్లిరూరల్ : సీతానగరం విజయకీలాద్రి దివ్యక్షేత్రంపై నిర్వహిస్తున్న ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా శనివారం భక్తులు గోదాదేవికి సారెను సమర్పించారు.



### పర్యాటకుల సందడి

విజయపురి సౌత్: నాగార్జున కొండను శనివారం భారీగా పర్యాటకులు సందర్శించారు. లాంచీలలో వెళ్లి కొండలోని మ్యూజియం చూసి తన్మయం చెందారు.

### ఆంజనేయుడికి నాగవల్లి పూజలు



ఫిరంగిపురం: మండల కేంద్రంలోని దక్షిణాముఖ ఆంజనేయస్వామి ఆలయంలో శనివారం విశేష పూజలు నిర్వహించారు. ఉదయాన్నే అర్చకులు స్వామికి అభిషేకాలు నిర్వహించి, నాగవల్లి దళాలతో అష్టోత్తర, సహస్రనామ అర్చనలు చేశారు.



## న్యూస్‌రీల్

### లక్కీ డిప్ విజేత సుబ్బారెడ్డి




సత్తెనపల్లి: రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాల్లో భాగంగా సత్తెనపల్లిలో లక్కీ డిప్ నిర్వహించిన విషయం తెలిసిందే. లక్కీ డిప్‌లో మొదటి బహుమతి రూ. 16 లక్షలు విలువ చేసే డైమండ్ నెక్లెస్ విజయవాడకు చెందిన మోలగొళ్ల సుబ్బారెడ్డికి దక్కింది. ఆయనకు శనివారం వైఎస్సార్ సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు డాక్టర్ గీతాహసంతి, మున్సిపల్ చైర్‌పర్సన్ చల్లంచర్ల లక్ష్మీ తులసి అందించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు చల్లంచర్ల సాంబశివరావు, షేక్ మౌలాలి, కొంఉతం స్వాతి, దేవతి సుబ్బారావు, శిరిగిరి వెంకట్రావు, హైదరాబాద్ సుభాని పాల్గొన్నారు.

### వైద్య కళాశాల రెగ్యులర్ ప్రిన్సిపాల్‌గా టీటీకే రెడ్డి



గుంటూరు మెడికల్ : గుంటూరు వైద్య కళాశాల ప్రిన్సిపాల్‌గా డాక్టర్ తేలుకుట్ల త్రిపురాంతకేశ్వరరెడ్డిని (టీటీకే రెడ్డి) నియమిస్తూ శనివారం వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబు ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం ఆయన ఫుల్ అడిషనల్ చార్జ్ (ఎఫ్ఏసీ) కళాశాల ప్రిన్సిపాల్‌గా విధులు నిర్వహిస్తున్నారు. డాక్టర్ టీటీకే రెడ్డికి అడిషనల్ డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్‌గా ప్రమోషన్ ఇచ్చి రెగ్యులర్ ప్రిన్సిపాల్‌గా నియమిస్తూ ఉత్తర్వులు జారీచేశారు. రెగ్యులర్ ప్రిన్సిపాల్‌గా ఉత్తర్వులు అందుకున్న డాక్టర్ టీటీకే రెడ్డికి గుంటూరు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్, వైద్య కళాశాల వైస్‌ప్రిన్సిపాల్స్ డాక్టర్ శ్రీధర్, డాక్టర్‌ప్రభాకర్, పలువురు కార్యాలయ ఉద్యోగులు, వైద్యులు అభినందనలు తెలిపారు.


### బాలోత్సవం బ్రోచర్ ఆవిష్కరణ



గుంటూరు ఎడ్యుకేషన్ : గుంటూరు నగరంలోని హిందూ కళాశాలలో ఫిబ్రవరి 17,18వ తేదీల్లో నిర్వహిస్తున్న గుంటూరు జిల్లా బాలోత్సవాన్ని విజయవంతం చేయాలని బాలోత్సవం అధ్యక్షుడు, ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు పేర్కొన్నారు. శనివారం బ్రాడీపేటలోని యూటీఎఫ్ కార్యాలయంలో బాలోత్సవం బ్రోచర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ విద్యతో పాటు అభిరుచి, ఆసక్తి, సృజన, జ్ఞానతృష్ణను ప్రోత్సహించేందుకు తలపెట్టిన బాలోత్సవంలో పాల్గొనే విధంగా పాఠశాలల యాజమాన్యాలు, తల్లిదండ్రులు పిల్లలను పంపాలని సూచించారు. బాల్సోతవం కన్వీనర్లు డాక్టర్ ఎం. బోసుబాబు, కేవీఎస్ దుర్గాప్రసాద్ మాట్లాడుతూ 25 రకాల అంశాల్లో జూనియర్, సీనియర్ విభాగాల్లో పోటీలు జరుగుతాయని తెలిపారు. బాల్సోతం ప్రధాన కార్యదర్శి బి. ప్రసాద్ మాట్లాడుతూ బాలోత్సవ పూర్తి వివరాలను పాఠశాలలకు పంపుతామని, పోటీల్లో పాల్గొనే ప్రతి విద్యార్థికి పార్టిసిపేషన్ సర్టిఫికెట్ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఆయా పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు, పాఠశాలలకు ఓవరాల్ ఛాంపియన్ షిప్ బహుమతులు అందజేస్తామని వివరించారు. కార్యక్రమంలో చావా శ్రీనివాస్, టి. జాన్‌బాబు జి. వెంకట్రావు, పీవీ మల్లేశ్వర్, వెంకటరెడ్డి, కె. శ్రీదేవి, ఎస్ఎం సుభానీ, ఎం. ఉదయ్‌భాస్కర్ పాల్గొన్నారు.



భోగి మంటలతో సంక్రాంతి లక్ష్మికి స్వాగతం



బొమ్మల కొలువు

# సంక్రాంతి సందడి...

- గ్రామాల్లో పండగ కోలాహలం
- సొంతూళ్లు చేరుకుంటున్న ప్రజలు
- భోగి మంటలతో సంక్రాంతికి స్వాగతం



చిన్నారికి భోగి పండ్లు పోస్తున్న మహిళలు

పల్లె సీమలు సంక్రాంతి పండగకు ముస్తాబయ్యాయి. జిల్లాలోని గ్రామాలన్నీ పండగ సందడి సంతరించుకున్నాయి. ఏ పల్లె లోగిళ్లు చూసినా పండగకు వచ్చిన పిల్లలు, పెద్దలు, పుట్టింటికి వచ్చిన ఆడపిల్లలు, బంధువులతో కళకళలాడుతున్నాయి. ఇళ్ల ముందు వేసిన సంక్రాంతి ముగ్గులు, గొబ్బెమ్మలు, పిండి వంటల సువాసనలతో గ్రామాలన్నీ కోలాహలంగా మారాయి. తెల్లవారుజామునే భోగి మంటలు వేసి పల్లెవాసులు పండగకు ఆహ్వానం పలికారు. హరిలో రంగా హరి.. శ్రీమద్రామాయణో గోవిందా అంటూ హరిదాసులు ఇంటింటికీ తిరుగుతూ ప్రజలను ఆధ్యాత్మిక తన్మయత్వంలో ముంచెత్తుతున్నారు. గంగిరెద్దులను సుందరంగా అలంకరించి మేళతాళాలతో ఆడిస్తూ ఆకట్టుకుంటున్నారు. చిన్నారులు బొమ్మల కొలువులు పెట్టుకుని ప్రత్యేక పూజలు చేస్తున్నారు. కొత్త ధాన్యపు పొంగళ్ల ప్రసాదం, గతించిన పెద్దలకు నూతన దుస్తులు సమర్పణ లాంటి అచ్చ తెలుగు సంస్కృతిని ప్రతిబింబించేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు. సొంతూళ్లు చేరుకునేందుకు బస్సులు, కార్లు, ఇతర వాహనాల్లో ఎక్కడెక్కడి నుంచో వస్తున్న ప్రయాణికులతో రహదారులన్నీ రద్దీగా మారాయి. ఆర్టీసీ బస్టాండ్లు సైతం కిటకిటలాడుతున్నాయి. పెద్ద పండుగ అయిన సంక్రాంతిని అంగరంగ వైభవంగా చేసుకునేందుకు ప్రజలు సిద్ధమయ్యారు.

– సాక్షి నెట్‌వర్క్



నల్లపాడులో ముగ్గుల పోటీలు



గుంటూరు బస్టాండ్‌లో ప్రయాణికుల రద్దీ



తెనాలి మండలం కరెవరంలో...

### బ్రదర్ జోసఫ్ తంబి తిరునాళ్ల ప్రారంభం



ఉంగుటూరు(గన్నవరం): మండలంలోని పెద అవుటపల్లిలో ఉన్న ప్రసిద్ధ కతోలిక పుణ్యక్షేత్రమైన తంబి పుణ్యక్షేత్రంలో మూడు రోజుల పాటు జరిగే బ్రదర్ జోసఫ్ తంబి 79వ వర్ధంతి మహోత్సవాలు శనివారం ప్రారంభమయ్యాయి. మేరిమాత కపూచిన్, ఆంధ్ర, తెలంగాణ, ఒడిశా ప్రావెన్షియల్ ఫాదర్ ప్రత్తిపాటి మరియదాసు దివ్య పూజాబలి సమర్పణతో మహోత్సవాలు ప్రారంభించారు. తంబి ఆదర్శమైన జీవితం గొప్ప సాక్ష్యంగా నిలిచిందని ఆయన పేర్కొన్నారు. తంబి చూపిన ఆధ్యాత్మిక మార్గంలో ప్రతి ఒక్కరూ నడవాలని సూచించారు. మరణించిన తరువాత కూడా ఆయన మధ్యస్థ ప్రార్థనల ద్వారా ఎన్నో మేలు, అద్భుతాలు చేస్తున్నారని పేర్కొన్నారు. సాయంత్రం ఐదు గంటలకు కపూచియన్ జూబిలేరియన్స్ సమష్టి దివ్య పూజాబలిని సమర్పించారు. పూజానంతరం జూబిలేరియన్స్ అయిన ఫాదర్లు బసంత్, ప్రతాప్, సుధాకర్ కేక్ కట్ చేశారు. పుణ్యక్షేత్ర రెక్టర్ ఫాదర్ పాలడుగు జోసఫ్, విచారణ గురువు అభిలాష్ ఇతర గురువులతో కలసి సన్మానం చేశారు. అస్సీసి ఆశ్రమం, ఎనికేపాడు గాయక బృందం ఫాదర్ సురేష్ నాయక్ ఆధ్వర్యంలో స్తుతి గీతాలను ఆలపించారు. రాత్రి ఎనిమిది గంటలకు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. సంసోను డెలీల బుర్రకథను, జోసఫ్ తంబి నాట్యమండలి వారు శిలువదారి క్రైస్తవ నాటకాన్ని ప్రదర్శించారు.

# మంగళగిరిలో వైఎస్సార్ సీపీదే విజయం

- ఎంపీ విజయసాయిరెడ్డి
- నాయకులు, కార్యకర్తలు సమష్టిగా గెలుపు కోసం పనిచేయాలి



ఎంపీ విజయసాయిరెడ్డిని సత్కరిస్తున్న వేమారెడ్డి తదితరులు

తాడేపల్లి రూరల్ : మంగళగిరిలో వైఎస్సార్ సీపీదే విజయం అని, మరింత మెజార్టీ వచ్చే విధంగా నాయకులు, కార్యకర్తలు ఒక లక్ష్యంగా పని చేయాలని రాజ్యసభ సభ్యులు ఎంపీ విజయసాయిరెడ్డి పిలుపునిచ్చారు. మంగళగిరి పార్టీ కార్యాలయంలో శనివారం ఎంటీఎంసీ అధ్యక్షుడు దొంతిరెడ్డి వేమారెడ్డి అధ్యక్షతన దుగ్గిరాల మండలంలోని వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న విజయసాయిరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలోనే మంగళగిరి నియోజకవర్గానికి ఒక ప్రత్యేకత ఉందని తెలిపారు. ఇక్కడ పెత్తందార్లు ప్రతిపక్ష పార్టీ నుంచి పోటీ చేస్తున్నప్పటికీ ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి బీసీ వర్గానికే సీటు కేటాయించాలని నిర్ణయించి వారినే ఎమ్మెల్యే అభ్యర్థిగా ప్రకటించారని చెప్పారు. మంగళగిరి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు మరోసారి విజయం సాధించడమే కాకుండా అత్యధిక మెజార్టీ వచ్చే లక్ష్యంగా పని చేయాలని పిలుపునిచ్చారు. గతంలో కొంతమంది పార్టీ నాయకులకు న్యాయం జరగలేదని, వారిని సైతం కలుపుకోవాలని చెప్పారు. నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా కార్యాచరణ రూపొందించుకుని రాబోయే మూడు నెలల్లో పార్టీని మరింత ముందుకు తీసుకు వెళ్లాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు దానబోయిన వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షుడు వడ్డేశ్వరపు రజనీకాంత్, జిల్లా డైరెక్టర్ పిల్లి రాఘవులు, జమ్ముల లోకేష్, దుగ్గిరాల వైఎస్సార్‌సీపీ నాయకుడు ఆళ్ల మహేష్, సర్పంచులు గంగాధరరావు, యస్‌కె. బాషా, కార్యకర్తలు పాల్గొన్నారు.



# ఓటు అడిగేందుకు ఏ హక్కుతో వచ్చారు ?

- టీడీపీ అభ్యర్థి రామాంజనేయులుపై ఫైర్
- సీఆర్ కాలనీ ప్రజల నిరసన
- గతంలో అధికారం ఇస్తే ఏం చేశారని ప్రశ్న
- చౌడవరంలో టీడీపీకి ఎదురుదెబ్బ



రామాంజనేయులు, జనసేన నాయకులను నిలదీస్తున్న సీఆర్ కాలనీ ప్రజలు

గుంటూరు రూరల్: ఓటు అడిగేందుకు ఏ హక్కుతో వచ్చారు.. గతంలో 14 ఏళ్ల అధికారం ఇస్తే సీఆర్ కాలనీకి ఏం చేశారని స్థానిక ప్రజలు టీడీపీ ప్రత్తిపాడు నియోజకవర్గ అభ్యర్థి రామాంజనేయులును నిలదీశారు. కాలనీలో శుక్రవారం సాయంత్రం ఏర్పాటు చేసిన కార్యక్రమానికి హాజరైన టీడీపీ, జనసేన నాయకులపై స్థానిక ప్రజలు మండిపడ్డారు. కాలనీలో కనీసం ఎటువంటి సౌకర్యాలు కల్పించలేక పోయారని ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక నాయకులు సైతం తమను పట్టించుకోలేదని, నేడు ఎన్నికలు రాగానే ఓట్లు అడిగేందుకు వచ్చారా? అని ప్రశ్నించారు. చంద్రబాబు హయాంలో కాలనీ ఏర్పడిందని, అప్పుడు ఎన్నోసార్లు రోడ్లు, తాగునీరు, రేషన్, అంగన్‌వాడీ కేంద్రాలు కావాలని అడిగినా పట్టించుకోలేదని మండిపడ్డారు. నేడు కార్పొరేషన్‌లో విలీనం తరువాత కనీసం రోడ్లయినా ఏర్పడ్డాయని, టీడీపీ హయాంలో ఒరిగిందేమి లేదని తేల్చి చెప్పారు. నేడు ఇంటి వద్దకే సంక్షేమ పథకాలు వస్తున్నాయని అభ్యర్థికి తెలిపారు. అసలు అధికారంలోకి వస్తే ఏం చేస్తారో చెప్పకుండా ఓట్లు అడిగేందుకు ఎలా వస్తారని ? ప్రశ్నించారు. దీంతో స్థానిక టీడీపీ, జనసేన నాయకులు ప్రజలకు నచ్చజెప్పారు. అనంతరం అక్కడి నుంచి పలాయనం చిత్తగించారు. రూరల్ మండలంలో ప్రతి గ్రామంలో టీడీపీకి ఎదురుదెబ్బ తగులుతూనే ఉందని ఆ పార్టీ నాయకులే బహిరంగంగా చర్చించుకుంటున్నారు.

### ఏఐఎస్టీఎఫ్ ఆర్థిక కార్యదర్శిగా జోసఫ్ సుధీర్‌బాబు ఎన్నిక



గుంటూరు ఎడ్యుకేషన్ : ఆలిండియా సెకండరీ స్కూల్ టీచర్ ఫెడరేషన్ (ఏఐఎస్టీఎఫ్) ఆర్థిక కార్యదర్శిగా గుంటూరు జిల్లాకు చెందిన ఎస్టీయూ పూర్వ రాష్ట్ర అధ్యక్షుడు సీహెచ్. జోసఫ్ సుధీర్‌బాబు ఎన్నికయ్యారు. శనివారం కర్నూలులో జరిగిన సదస్సులో భాగంగా ఆయన్ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఎస్టీయూ గుంటూరు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డి.పెదబాబు, డీకే సుబ్బారెడ్డి తెలిపారు. ఎస్టీయూలో మండలస్థాయి మొదలు జిల్లా, రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శిగా పని చేసిన సుధీర్‌బాబు ఫ్యాప్టో సెక్రటరీ జనరల్‌గా బాధ్యతలు నిర్వర్తించారని పేర్కొన్నారు.

## క్లుప్తంగా

### ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు: జిల్లా ఎస్పీ

**నగరంపాలెం:** జిల్లా ప్రజలకు, పోలీసు సిబ్బందికి జిల్లా ఎస్పీ కె.ఆరిఫ్‌హఫీజ్ శనివారం సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. సంక్రాంతి పండుగ అందరి జీవితాలలో నూతన కాంతులు, సంతోషాలను నింపాలని అన్నారు. భోగి భోగభాగ్యాలను, సంక్రాంతి సుఖసంతోషాలను, కనుమ కమ్మని కనువిందులను అందించాలని ఆకాంక్షించారు. తెలుగు సంస్కృతి సంప్రదాయాల మేలవింపుతో కుటుంబ సభ్యులు, బంధుమిత్రుల సమక్షంలో చేసుకోవాలని అన్నారు.

### ఘనంగా ఎల్‌జీ సంక్రాంతి సంబరాలు



**పాత గుంటూరు:** సంక్రాంతి సందర్భంగా ఎల్.జీ. నిర్వహించిన లక్కీ డ్రాలో గుంటూరు సోనోవిజన్ కస్టమర్ కిరణ్‌కుమార్ రెడ్డి రూ.2,69,990 విలువ చేసే ఎల్.జీ. 55 ఇంచ్ ఏఎల్ఈడీ టీవీని గెలుపొందారు. కార్యక్రమంలో సోనోవిజన్ అధినేత పాట్లూరి భాస్కర్ మూర్తి, విజయవాడ బ్రాంచ్ మేనేజర్ పరుచూరి కిషోర్‌బాబు, మార్కెటింగ్ మేనేజర్ హేమంత్ కుమార్ పాల్గొని విజేతకు బహుమతిని అందజేశారు.

### మచిలీపట్నం వైద్య కళాశాల ప్రిన్సిపాల్‌గా డాక్టర్ సుందరాచారి



**గుంటూరు మెడికల్:** మచిలీపట్నం ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్‌గా డాక్టర్ నాగార్జునకొండ వెంకట సుందరాచారిని నియమిస్తూ రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబు శనివారం ఉత్తర్వులు జారీచేశారు. ప్రస్తుతం డాక్టర్ సుందరాచారి గుంటూరు జీజీహెచ్ న్యూరాలజీ వైద్య విభాగాధిపతిగా విధులు నిర్వహిస్తున్నారు. అడిషనల్ డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్‌గా డాక్టర్ సుందరాచారికి పదోన్నతి ఇచ్చి మచిలీపట్నం వైద్య కళాశాల ప్రిన్సిపాల్‌గా బదిలీ చేశారు. గుంటూరు వైద్య కళాశాలలో 1981లో ఎంబీబీఎస్ చదివి, అనంతరం న్యూరాలజీలో పీజీ చేసి 2001లో జీజీహెచ్‌లో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా ఆయన విధుల్లో చేరారు.

అసోసియేట్ ప్రొఫెసర్‌గా, ప్రొఫెసర్‌గా గుంటూరు జీజీహెచ్‌లో డాక్టర్ సుందరాచారి పదోన్నతులు పొంది పనిచేశారు. గత ఏడాది రాష్ట్ర ఉత్తమ టీచర్ అవార్డును అందుకున్నారు. న్యూరాలజీ విభాగాన్ని రాష్ట్రంలోనే ఉత్తమ విభాగంగా తీర్చిదిద్దారు. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా గుంటూరు జీజీహెచ్ న్యూరాలజీ వార్డులో స్లీప్ ల్యాబ్, స్ట్రోక్ యూనిట్‌లు ఏర్పాటు చేయటం ద్వారా నాణ్యమైన వైద్య సేవలతో 2018లో ఐఎస్ఓ గుర్తింపు సైతం న్యూరాలజీ వార్డుకు లభించడంలో డాక్టర్ సుందరాచారి కృషి ఎనలేనిది. 2022లో ఫెలో ఆఫ్ ది అమెరికన్ అకాడమీ ఆఫ్ న్యూరాలజీగా ఎన్నికై అరుదైన రికార్డు సొంతం చేసుకున్నారు.

# జీజీహెచ్‌లో నర్సింగ్ సేవలు పటిష్టం

- అదనంగా నర్సింగ్ సిబ్బంది కేటాయింపు
- రోగులకు మెరుగైన వైద్యసేవలే లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు
- వైఎస్సార్ సీపీ అధికారంలోకి రాగానే 250 నర్సుల పోస్టులు మంజూరు
- తాజాగా 50 స్టాఫ్‌నర్సులు, 15 హెడ్ నర్సు పోస్టుల మంజూరు
- వైద్యసేవల్లో నర్సులే కీలకం



రోగులకు సేవలను అందిస్తున్న నర్సింగ్ సిబ్బంది

**గుంటూరు మెడికల్:** ఆస్పత్రిలో నర్సుల పాత్ర కీలకం. తొలిగా రోగిని చిరునవ్వుతో పలకరించి, వైద్యుడి వద్దకు తీసుకెళ్లేందుకు సహకరిస్తుంటారు. ఈ వృత్తి ఎంతో పవిత్ర హృదయంతో చేస్తుంటారు. కాలిన గాయాలు... కుళ్లిన శరీరభాగాలు...గాయపడి, రక్త మోడుతూ దుర్గంధం వెదజల్లే శరీరాలకు నర్సులు సేవలను అందిస్తారు. వారి ప్రాధాన్యాన్ని గుర్తించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పనిభారం తగ్గించేందుకు చర్యలు తీసుకున్నారు. అందులో భాగంగా గుంటూరు సమగ్ర ఆస్పత్రికి అదనంగా నర్సింగ్ పోస్టులు కేటాయించారు.

**నర్సుల పనిభారం తగ్గించి...**

రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా 2020లో ఒకేసారి 250 కాంట్రాక్ట్ సాఫ్‌నర్సులను ప్రభుత్వం కేటాయించింది. ఆస్పత్రిలో స్టాఫ్‌నర్సులు 207 మంది, హెడ్ నర్సులు 62 మంది పనిచేస్తున్నారు. పలుమార్లు నర్సింగ్ సంఘాల వారు తమ సమస్యలపై వినతిపత్రం అందించిన నేపథ్యంలో గత టీడీపీ ప్రభుత్వం జీజీహెచ్‌కు కేవలం 160 కాంట్రాక్ట్ స్టాఫ్‌నర్సులు మాత్రమే కేటాయించింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఒకేసారి 250 పోస్టులు ఇచ్చి రికార్డు సృష్టించింది. వీరితో పాటు ఇటీవల కాలంలో జీజీహెచ్ నాట్కో క్యాన్సర్ సెంటర్‌లో 30 మంది, ఎస్ఎస్‌సీయూ, ఎస్ఆర్‌సీ వైద్య విభాగాల్లో 34 స్టాఫ్‌నర్సుల పోస్టులను ప్రభుత్వం భర్తీ చేసింది. తాజాగా గ్రేడ్1 నర్సిగ్ సూపరింటెండెంట్ పోస్టు 1, గ్రేడ్- 2 నర్సింగ్ సూపరింటెండెంట్ పోస్టులు మూడు, హెడ్ నర్సులు పోస్టులు 15 ప్రభుత్వం మంజూరు చేసింది. ఒకేసారి 18 రెగ్యులర్ నర్సింగ్ పోస్టులు మంజూరు చేశారు.

**నర్సులు ఆస్పత్రిలో చేస్తున్న వైద్య సేవలు..**

జీజీహెచ్ ఇన్‌పేషెంట్ వార్డులో ఉంటున్న రోగులకు కావాల్సిన మందులు అందించడం, వార్డులో ఉండే రోగులకు కావాల్సిన మందులను మెడికల్ స్టోర్ నుంచి ఇండెంట్ పెట్టి తెప్పించటం చేస్తున్నారు. రోగుల పడకలను శుభ్రంగా ఉండేలా చేయించటం(బెడ్ మేకింగ్) ఫ్లూయిడ్స్ ఎక్కించటం, వ్యాధినిర్ధారణ పరీక్షలకు రోగిని పంపించటం, వార్డులో వర్క్‌షాపునకు సంబంధించిన పనులు చేస్తున్నారు. యూనిట్ చీఫ్, అసిస్టెంట్ డాక్టర్లు రోగులను పరీక్షించేందుకు వార్డుకు రౌండ్స్‌కు వచ్చినప్పుడు వారి వెంట ఉండి సహాయం చేయటం, వార్డు శుభ్రంగా ఉండేలా చూడటం తదితర పనులను నర్సులు చేస్తుంటారు.

## సీఎంకు ప్రత్యేక ధన్యవాదాలు



ఇప్పటి వరకు కనీవినీ ఎరుగని రీతిలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నర్సింగ్ సిబ్బంది, నర్సింగ్ అధికారుల పోస్టులు మంజూరు చేయటం చాలా సంతోషకంగా ఉంది. సీఎంకి చాలా రుణపడి ఉంటాం. ఇప్పటి వరకు నర్సుల సిబ్బంది గురించి ఎవ్వరూ ఇంత ప్రత్యేక చొరవ చూపించలేదు. ఆస్పత్రికి నర్సింగ్ సిబ్బంది పోస్టులు అదనంగా మంజూరు చేసిన ముఖ్యమంత్రికి ప్రత్యేక ధన్యవాదాలు.

– కె.ఆశాసజని, గ్రేడ్-1 నర్సింగ్ సూపరింటెండెంట్, జీజీహెచ్

## జీజీహెచ్ పురోభివృద్ధికి కృషి



గత ప్రభుత్వాలు ఎవ్వరూ చేయని విధంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ఆస్పత్రి అన్ని రంగాల్లో బాగా అభివృద్ధి చెందుతోంది. వైద్యులు, వైద్య సిబ్బంది పోస్టులు భారీగా భర్తీ చేసి అదనంగా పోస్టులు ఇచ్చారు. తాజాగా నర్సింగ్ సిబ్బంది పోస్టులు ఇచ్చి మెరుగైన వైద్యసేవలు సత్వరమే రోగులకు అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంది. సీఎం జగన్ పరిపాలన ఆస్పత్రిలో స్వర్ణయుగం లాంటింది. ఆస్పత్రి అభివృద్ధికి నిత్యం కృషి చేస్తున్న వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని, ప్రిన్సిపల్ సెక్రటరీ ఎం.టి.కృష్ణబాబు, డీఎంఈ డాక్టర్ నరసింహం, జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాలరెడ్డి, గుంటూరు తూర్పు ఎమ్మెల్యే ముస్తఫాకు ప్రత్యేక ధన్యవాదాలు.

–డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్, జీజీహెచ్ సూపరింటెండెంట్

# నాట్కో క్యాన్సర్ సెంటర్ సేవలు అద్భుతం

జింకానా అధ్యక్షుడు డాక్టర్ లక్ష్మీప్రసాద్



నాట్కో క్యాన్సర్ సెంటర్‌ను పరిశీలిస్తున్న డాక్టర్ లక్ష్మీప్రసాద్, డాక్టర్ బాలభాస్కరరావు, నన్నపనేని

**గుంటూరు మెడికల్:** నాట్కో క్యాన్సర్ సెంటర్ సేవలు అద్భుతం అని, వాటిని కొనసాగించాలని గుంటూరు మెడికల్ కాలేజీ అసోసియేషన్ ఆఫ్ నార్త్ అమెరికా అధ్యక్షుడు(జింకాన), అమెరికాకు చెందిన ప్రముఖ వైద్యులు డాక్టర్ వేములపల్లి లక్ష్మీ ప్రసాద్ పేర్కొన్నారు. గుంటూరు జింకానా సమన్వయకర్త డాక్టర్ వెనిగండ్ల బాల భాస్కరరావుతో కలసి గుంటూరు జీజీహెచ్ నాట్కో క్యాన్సర్ సెంటర్‌ను శనివారం పరిశీలించారు. క్యాన్సర్ రోగులకు అందుబాటులో ఉన్న సౌకర్యాలు, వైద్య పరికరాల వివరాలు అడిగి తెలుసుకున్నారు. నాట్కో ఫార్మా ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ నన్నపనేని సదాశివ రావు, క్యాన్సర్ సెంటర్ సమన్వయ కర్త యడ్లపాటి అశోక్‌కుమార్ పాల్గొని నాట్కో ట్రస్ట్ అందిస్తున్న సేవలు వివరించారు. క్యాన్సర్ సెంటర్ నిర్మాణ విధానం, సెంటర్‌ను నాట్కో ట్రస్ట్ నిర్వహిస్తున్న తీరు, కోట్లాది రూపాయల విలువైన మందులు రోగులకు ఉచితంగా అందజేస్తున్న నాట్కో ఫార్మా వితరణ గొప్పగా ఉన్నాయని డాక్టర్ లక్ష్మీప్రసాద్ ప్రశంసించారు. ప్రభుత్వ రంగంలో ఎన్నో సేవలు అందించిన నాట్కో అధినేత వి.సి.నన్నపనేని త్యాగం అభినందనీయమని పేర్కొన్నారు. తొలుత జీజీహెచ్‌లో నూతనంగా నిర్మిస్తున్న ఐసీయూను సందర్శించారు. అద్భుతంగా ఐసీయూ నిర్మాణం చేశారని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్‌ను అభినందించారు.

# సీఎంఏ ఫౌండేషన్ ఫలితాల్లో శ్రీమేధ ప్రభంజనం



విద్యార్థులతో అన్నా నందకిషోర్

**గుంటూరు ఎడ్యుకేషన్:** సీఎంఏ ఫౌండేషన్ ఫలితాల్లో శ్రీమేధ విద్యార్థులు ఆలిండియా టాప్ మార్కులతో పాటు అత్యధిక పాస్ పర్సంటేజ్ సాధించారని సంస్థ చైర్మన్ అన్నా నందకిషోర్ తెలిపారు. కొత్తపేటలోని శ్రీమేధ విద్యాసంస్థ ప్రధాన కార్యాలయంలో శనివారం జరిగిన విద్యార్థుల అభినందన కార్యక్రమం నిర్వహించారు. నందకిషోర్ మాట్లాడుతూ ఇనిస్టిట్యూట్ ఆఫ్ కాస్ట్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా(ఐసీఎంఏఐ) ఈనెల 11న ప్రకటించిన ఫలితాల్లో ప్రతిభ చూపినట్లు వివరించారు. గత 19 ఏళ్లుగా సీఏ, సీఎంఏ కోర్సుల్లో తమ సంస్థ 400కు పైగా ఆలిండియా ర్యాంకులను సాధించినట్లు చెప్పారు. ప్రస్తుత ఫలితాల్లో తమ విద్యార్థిని ఆలివ్ గ్లోరియానా 400 మార్కులకు గాను 356 మార్కులు, కె.యోగితారెడ్డి 352, టి.నందిని దుర్గ 342, ఏ సాయి వెంకట ధీరజ్ 340 వంటి టాప్ మార్కులను కైవసం చేసుకున్నట్లు వివరించారు. వీరిలో ఏ సాయి వెంకట ధీరజ్ మాథ్స్, స్టాటిస్టిక్స్ సబ్జెక్టుల్లో 100కు వంద మార్కులు సాధించినట్లు తెలిపారు. ఇంటర్మీడియెట్ నుంచి సీఏ, సీఎంఏ ఫౌండేషన్ కోర్సులకు కాయిన్ బ్యాచ్ ప్రోగ్రాం ద్వారా అనుభవజ్ఞులైన అధ్యాపకులచే శిక్షణ కల్పించడం ద్వారా తమ విద్యార్థులు అఖిల భారతస్థాయిలో టాప్ మార్కులు సాధిస్తున్నారని వివరించారు. సీఎంఏ ఫౌండేషన్ ఉత్తీర్ణులైన విద్యార్థులకు సీఎంఏ ఇంటర్ తరగతులు, ఉత్తీర్ణులు కాని విద్యార్థులకు సీఎంఏ ఫౌండేషన్ క్రాష్ బ్యాచ్ తరగతులు ఈనెల 22 నుంచి ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఈసందర్భంగా విద్యార్థులను నందకిషోర్‌తో పాటు డైరెక్టర్ శ్రీలక్ష్మి అభినందించారు.

# ప్రకృతి వ్యవసాయంతోనే ఆరోగ్యకర సమాజం



ప్రకృతి రైతు బాపారావు దంపతులను సత్కరిస్తున్న గ్రామభారతి వ్యవస్థాపకులు

**తెనాలి:** పెరుగుతున్న భూతాపంతో ప్రపంచ వ్యాప్తంగా ఎన్నో అనర్థాలు సంభవిస్తున్నాయని, దీని నివారణకు ఏకైక పరిష్కారం ప్రకృతి వ్యవసాయమేనని ఏపీ రైతు సాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్‌చైర్మన్ టి.విజయకుమార్ అన్నారు. ఈ మార్గంలో ఎప్పుడో ముందడుగు వేసిన అత్తోట గ్రామం రాష్ట్రానికే ఆదర్శమన్నారు. ధనుర్మాసం సందర్భంగా ఒంగోలులోని గ్రామభారతి, కొల్లిపర మండల గ్రామం అత్తోటలో 'భూమి భారతి' సంయుక్త ఆధ్వర్యంలో శనివారం 'విష్ణు హారతి'ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన టి.విజయకుమార్ తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ.. ఆహారాన్ని పండించే రైతులంతా దైవ ప్రతి రూపాలేనని, ప్రతి రైతు విష్ణుదేవుడితో సమానమన్నారు. ప్రకృతి విధానంలో సాగుచేసే రైతులు మరింత ప్రత్యేకమంటూ, వీరిని ఆరోగ్య దేవుళ్లుగా భావించవచ్చని చెప్పారు. ప్రపంచంలో ఇప్పుడు వాతావరణ అత్యవసర పరిస్థితి నెలకొందన్నారు. రసాయనిక ఎరువులతో కూడిన వ్యవసాయమే ఇందుకు ప్రధాన కారణమన్నారు. 34 శాతం గ్రీన్‌హౌస్ వాయువులు వ్యవసాయంతోనే విడుదలవుతున్నాయని చెప్పారు. దీని నివారణకు గానూ ప్రపంచ దేశాల అధ్యక్షులంతా కృషి చేస్తున్నట్టు తెలిపారు. వాస్తవానికి ఈ ప్రమాదం నుంచి కాపాడగలిగిన శక్తి ప్రకృతి వ్యవసాయంలోనే ఉందన్నారు. ఈ విధానంలో భూమి ఆరోగ్యం బాగుంటుందనీ, ఆరోగ్యకర ఉత్పత్తులు అభిస్తాయని వివరించారు.

మదనపల్లికి చెందిన ప్రకృతి రైతు 'ప్రకృతివనం' ప్రసాద్ మాట్లాడుతూ భూమి ఆరోగ్యం బాగుంటేనే శక్తివంతమైన ఆహారం వస్తుందని స్పష్టం చేశారు. ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్టు మేనేజరు రాజకుమారి మాట్లాడుతూ అత్తోట గ్రామాన్ని పూర్తి ప్రకృతి సాగుకు మార్చే క్రమంలో 'విష్ణు హారతి'తో శ్రీకారం చుడుతున్నారని చెప్పారు. పండుగలు పక్కదారి పడుతున్న తరుణంలో ధనుర్మాసంలో ప్రతిచోట రైతులను పూజించే పండుగ జరగాలనే ఆకాంక్షతో విష్ణు హారతిని గత మూడేళ్లుగా జరుపుతున్నామని గ్రామభారతి, ఒంగోలు వ్యవస్థాపకురాలు శివపార్వతి చెప్పారు. తొలుత గోపూజతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రకృతి సాగు చేస్తున్న రైతులు యర్రు అప్పారావు, గంటా కనకయ్య, యర్రు బాపారావు, యర్రు గంగాధరం, చందు వెంకటేశ్వర్లు, పోలిశెట్టి హనుమయ్య, మామిళ్ల ఆంజనేయులు, మీసాల సాంబయ్య, యర్రు రవీంద్ర, యర్రు పెదగంగయ్య, గనిపిశెట్టి శ్రీనివాసరావు, కొండా కిశోర్‌రెడ్డి దంపతులను సంప్రదాయబద్ధంగా సత్కరించారు. ప్రకృతి వ్యవసాయాన్ని ఉద్యమంలా చేస్తున్న చందోలు కుమార్ (చిత్తూరు), సయ్యద్ సుభాని (సింగరాయకొండ), ప్రకాశం జిల్లాకు చెందిన పాదర్తి రామారావు, బి.రామాంజనేయులు, ప్రకృతి వ్యవసాయం సీఆర్‌పీ తాతాజీని సన్మానించారు. ప్రకృతిసాగు రైతుల నుంచి సేకరించిన దేశవాళీ రకాల ధాన్యానికి ముందుగానే నిర్ణయించిన ధర బస్తాకు రూ.2,500లు చొప్పున మొత్తం రూ.6.50 లక్షల చెక్కులను ఆయా రైతులకు అందజేశారు. విద్యుత్ ఎస్ఈ ఆవుల మురళీకృష్ణ యాదవ్ మాట్లాడారు.

# భారీ దొంగతనం కేసులను ఛేదించిన పోలీసులు

- రూ.80లక్షలు విలువైన సొత్తు స్వాధీనం
- 13 మంది నిందితులను అరెస్ట్
- వివరాలు వెల్లడించిన ఎస్పీ రవిశంకర్‌రెడ్డి
- ప్రధాన నిందితుడిపై పీడీ యాక్టు నమోదు చేస్తామని ఎస్పీ వెల్లడి



నిందితుల నుంచి రికవరీ చేసిన బంగారం, వెండి వస్తువులు పరిశీలిస్తున్న ఎస్పీ రవిశంకర్‌రెడ్డి

**దాచేపల్లి:** పలు దొంగతనాల కేసుల్లో నిందితులను పోలీసులు శనివారం అరెస్ట్ చేశారు. 25 కేసుల్లో 13 మంది నిందితులను అరెస్ట్ చేసి వీరి వద్ద నుంచి రూ.80 లక్షలు విలువ చేసే బంగారం, వెండి, ద్విచక్ర వాహనాలు, కార్లను స్వాధీనం చేసుకున్నారు. దాచేపల్లి పోలీస్‌స్టేషన్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పల్నాడు జిల్లా ఎస్పీ వై. రవిశంకర్‌రెడ్డి వివరాలు వెల్లడించారు. రెంటచింతల మండలం గోలి గ్రామానికి చెందిన పొన్నూరి చిన్న సత్యానందం 14 ఏళ్ల కిందట లైంగిక దాడి, హత్య కేసులో నిందితుడిగా జైలు జీవితం గడిపాడు. జైలులో కొంత మంది నేరస్తులతో స్నేహం చేశాడు. బయటికి వచ్చిన తరువాత 11 మంది పాత నేరస్తులతో కలసి దొంగతనాలు చేయటం ప్రారంభించాడు. రెండు కార్లు కొనుగోలు చేసి పగలు రెక్కీ నిర్వహించి తాళం వేసిన ఇళ్లను గుర్తించేవారు. మొత్తం 25 చోట్ల దొంగతనాలకు పాల్పడ్డారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు వరుస దొంగతనాలపై పోలీసులు కేసు నమోదు చేసి క్రైం అడిషనల్ ఎస్పీ ఎస్.కె.చంద్రశేఖర్ పర్యవేక్షణలో గురజాల డీఎస్పీ ఎ.పల్లపురాజు, సీఐ ఎ.సురేంద్రబాబు ఆధ్వర్యంలో ఎస్ఐలు దాసరి శివనాగరాజు, జి.సంధ్యారాణి, షేక్ సమీర్‌బాషా దర్యాప్తు చేపట్టారు. దొంగతనాల కేసుల్లో పోలీసులకు లభించిన ఆధారాలతో దర్యాప్తు చేసి పొన్నూరి చిన్న సత్యానందంని ప్రధాన నిందితుడిగా గుర్తించారు. చిన్న సత్యానందాన్ని అదుపులోకి తీసుకుని విచారించగా దొంగతనాలు చేసినట్లు అంగీకరించాడు. చిన్న సత్యానందంతోపాటుగా దొంగతనాలకు పాల్పడిన పాత నేరస్తులు షేక్ ఇమాంసా, షేక్ జానీబాషా, రుద్రాల సురేష్, ఎ.నరేష్, మహంకాళి గణేష్, షేక్ బుడేసాహెబ్, షేక్ నాగుర్‌వలి, మిరియాల శ్రీకాంత్, షేక్ అబ్దుల్ సుకుర్‌లను గురజాల, జూలకల్లు, దాచేపల్లి గ్రామాల్లో మధ్యవర్తుల సమక్షంలో పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుల నుంచి రూ.50 లక్షలు విలువ చేసే 850 గ్రాముల బంగారం, రూ.1.50లక్షలు విలువ చేసే 2.5 కేజీల వెండి, రూ.20 లక్షలు విలువ చేసే నాలుగు కార్లు, రూ.8.5 లక్షలు విలువ చేసే ద్విచక్రవాహనాలు స్వాధీనం చేసుకున్నారు. చిన్న సత్యానందం టీంపై నమోదైన కేసుల్లో 18 కేసులు పల్నాడు జిల్లా పరిధిలో ఉన్నట్లు ఎస్పీ వెల్లడించారు. ప్రధాన నిందితుడు చిన్న సత్యానందంపై పీడీయాక్ట్ నమోదు చేస్తామని ఎస్పీ చెప్పారు. మరో కేసులో ద్విచక్రవాహనాల దొంగతనాలకు పాల్పడిన పాత నేరస్తులైన గురజాలకి చెందిన చలువాది సైదారావు, సన్నెబోయిన శ్రీకాంత్, గాజుల నారాయణను నడికుడి వ్యవసాయ మార్కెట్ యార్డు వద్ద అరెస్ట్ చేసి 12 ద్విచక్రవాహనాలు స్వాధీనం చేసుకున్నారు. దొంగతనం కేసుల్లో సమర్థంగా పనిచేసిన సీఐ సురేంద్రబాబు, ఎస్ఐలు దాసరి శివనాగరాజు, షేక్ సమీర్‌బాషా, జీ.సంధ్యారాణి, కానిస్టేబుల్స్‌కి ఎస్పీ రివార్డులు అందజేశారు. సమావేశంలో గురజాల డీఎస్పీ ఎ. పల్లపురాజు పాల్గొన్నారు.

## జాతీయస్థాయి ఎడ్ల పూటీ



పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శివకుమార్

**కొల్లిపర:** సంక్రాంతి పండుగను పురస్కరించుకుని మండలంలోని చెంచల రామిరెడ్డి ఇటుక బట్టీలో ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు కార్యక్రమంలో భాగంగా ఒంగోలు జాతి ఎడ్ల పూటీ లాగుడు బల ప్రదర్శన పోటీలు శనివారం ప్రారంభమయ్యాయి. ఎమ్మెల్యే ప్రారంభించారు. పోటీల్లో జూనియర్స్ విభాగంలో 150 కేజీలు, న్యూ జూనియర్స్ విభాగంలో 100 కేజీలు, లోకల్స్ విభాగంలో 50 కేజీలు లాగుడు పోటీలు నిర్వహిస్తామన్నారు. ఒక్కొక్క విభాగానికి ఆరు బహుమతులు ఉంటాయని, జూనియర్స్ విభాగంలో రూ.30 వేల నుంచి రూ.8 వేల వరకు, న్యూ జూనియర్స్ విభాగంలో రూ.25వేల నుంచి రూ.8 వేల వరకు, లోకల్స్ విభాగంలో రూ.20 వేల నుంచి రూ.6వేల వరకు బహుమతులు అందజేస్తామన్నారు.ఈ నెల 15వ తేదీ వరకు ఈ పోటీలు కొనసాగుతాయని వివరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు చెంచల రామిరెడ్డి, ఈద యస్వంత్‌రెడ్డి, అవుతు పోతిరెడ్డి, అరిగ చంద్రారెడ్డి, ఈమని హరికోటిరెడ్డి, అవుతు నగేష్‌రెడ్డి, భీమవరపు శివకోటిరెడ్డి, ఉయ్యూరు ఉమమహేశ్వరరెడ్డి, బొల్లిముంత పోతురాజు పాల్గొన్నారు.

# స్పోర్ట్స్



## రన్నరప్‌గా బోపన్న జోడి

కొత్త ఏడాదిని టైటిల్‌తో ప్రారంభించాలనుకున్న భారత వెటరన్ టెన్నిస్ స్టార్ రోహన్ బోపన్నకు నిరాశే ఎదురైంది. అడిలైడ్ ఇంటర్నేషనల్ ఏటీపీ -250 టోర్నీలో బోపన్న - మాథ్యూ ఎబ్డెన్ (ఆస్ట్రేలియా) జోడి రన్నరప్‌గా నిలిపెట్టుకుంది. శనివారం జరిగిన ఫైనల్లో మూడో సీడ్ రాజీవ్ రామ్ (అమెరికా) - జో సాలిస్‌బరీ ద్వయం 7-5, 5-7, 11-9తో రెండో సీడ్ బోపన్న - ఎబ్డెన్‌పై విజయం సాధించింది. బోపన్న జంట 12 ఏస్‌లు సంధించినా లాభం లేకపోయింది. తొలి సెట్‌లో ఒక దశలో 4-0తో ఆధిక్యంలో ఉండి కూడా బోపన్న టీమ్ దానిని చేజార్చుకుంది. రెండో సెట్‌లో స్కోరు 5-5తో సమంగా ఉన్న సమయంలో ప్రత్యర్థి గేమ్‌ను బ్రేక్ చేసి ముందంజ వేసిన రోహన్ - ఎబ్డెన్ ఆ తర్వాత సెట్‌ను గెలుచుకున్నారు. మూడో సెట్ టైబ్రేకర్‌తో చివరకు రాజీవ్ - సాలిస్‌బరీదే పైచేయి అయింది. ఒక గంటా 38 నిమిషాల పాటు సాగిన ఈ హోరాహోరీ పోరులో 5 డబుల్ ఫాల్ట్‌లు చేసి కూడా ఈ జంట గట్టెక్కింది.

# ఆరు గేమ్ పాయింట్లు కాపాడుకొని...



- ఫైనల్లో సాత్విక్ - చిరాగ్ జోడి
- మలేసియా ఓపెన్ బ్యాడ్మింటన్

కౌలాలంపూర్: అంతర్జాతీయ బ్యాడ్మింటన్ వేదికపై మరో టైటిల్ సాధించేందుకు భారత ఆటగాళ్లు సాత్విక్ సాయిరాజ్ - చిరాగ్ శెట్టి అడుగు దూరంలో నిలిచారు. బీడబ్ల్యూఎఫ్ వరల్డ్ టూర్ -1000 టోర్నీ మలేసియా ఓపెన్‌లో ఈ జోడి ఫైనల్లోకి అడుగు పెట్టింది. ఆరు గేమ్ పాయింట్లు కాపాడుకోవడంతో పాటు ఆపై మరో రెండు పాయింట్లు గెలుచుకొని విజయాన్ని సొంతం చేసుకుంది. రెండో సీడ్ సాత్విక్ - చిరాగ్ 21-18, 22-20 స్కోరుతో ఆరో సీడ్, కొరియాకు చెందిన కాంగ్ మిన్ హ్యూక్ - సియో స్యూంగ్ జాను చిత్తు చేశారు. 47 నిమిషాల పాటు సాగిన మ్యాచ్ సాగింది.

తొలి గేమ్ ఆరంభంలో భారత ఆటగాళ్ల ఆధిక్యం సాగింది. చక్కటి ర్యాలీలతో వీరిద్దరు 9-5తో ముందంజ వేయగా వరుసగా నాలుగు పాయింట్లతో కొరియా ద్వయం స్కోరును సమం చేసింది. అయితే 11-9తో, ఆపై 13-12తో మన జట్టు ఆధిక్యం ప్రదర్శించింది. వరుస పాయింట్లతో 17-13 వరకు దూసుకెళ్లిన చిరాగ్ - సాత్విక్ దానిని కొనసాగించారు. రెండో గేమ్ మాత్రం హోరా హోరీగా సాగింది. అనంతరం 9-4తో...11-6తో ఆధిక్యం చూపించిన కొరియా ఆటగాళ్లు ఒక దశలో 17-11తో గేమ్‌పై పట్టు బిగించారు. ఈ సమయంలో భారత్ కోలుకునే ప్రయత్నం చేసినా 20-14తో గేమ్ గెలిచే స్థితికి కొరియా చేరింది. అయితే ఇక్కడే మ్యాచ్ మలుపు తిరిగింది. ఒకటి కాదు రెండు కాదు...వరుసగా ఎనిమిది పాయింట్లు సాధించిన సాత్విక్ - చిరాగ్ సంచలనం సృష్టించారు. నేడు జరిగే ఫైనల్లో చైనాకు చెందిన టాప్ సీడ్ జంట లియాంగ్ వి కెంగ్ - వాంగ్ చాంగ్‌తో సాత్విక్ - చిరాగ్ తలపడతారు. గతంలో ఈ రెండు జోడీల మధ్య 4 మ్యాచ్‌ల జరగ్గా...భారత ద్వయం 1 మ్యాచ్‌లో గెలిచి 3 మ్యాచ్‌లలో ఓడింది.



రోహిత్, దూబే

# సిరీస్ గెలిచే లక్ష్యంతో...

- నేడు భారత్, అఫ్గనిస్తాన్ రెండో టి20
- బరిలోకి దిగనున్న విరాట్ కోహ్లి
- రా.7 గం.నుంచి స్పోర్ట్స్ 18, జియో సినిమాలో ప్రత్యక్ష ప్రసారం

ఇండోర్: బ్యాటింగ్‌కు బాగా అనుకూలమైన పిచ్, వేగవంతమైన అవుట్‌ఫీల్డ్, చిన్న బౌండరీలు...ఇండోర్‌లోని హోల్కర్ స్టేడియంలో పరుగుల వరదకు రంగం సిద్ధమైంది. మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా నేడు ఇక్కడ జరిగే రెండో టి20 మ్యాచ్‌లో భారత్, అఫ్గనిస్తాన్ తలపడనున్నాయి. తొలి మ్యాచ్‌ను గెలిచి 1-0తో ముందంజలో ఉన్న భారత్ ఈ మ్యాచ్‌నూ సొంతం చేసుకొని సిరీస్‌ను తమ ఖాతాలో వేసుకోవాలని భావిస్తోంది.

భారత తుది జట్టులో స్వల్ప మార్పులు జరగనున్నాయి. గత మ్యాచ్ ఆడని విరాట్ కోహ్లి ఇప్పుడు బరిలోకి దిగుతున్నాడు. మరో 35 పరుగులు చేస్తే కోహ్లి టి20 క్రికెట్‌లో 12 వేల పరుగులు పూర్తి చేసుకున్న తొలి భారత ఆటగాడిగా నిలుస్తాడు. కోహ్లి రాకతో గిల్‌ను పక్కన పెట్టడం ఖాయం. అయితే ఓపెనర్ యశస్వి గాయంనుంచి కోలుకుంటే జట్టులోకి వస్తాడు. లేదంటే గిల్‌కు మరో అవకాశం దక్కుతుంది. బౌలింగ్‌లో కూడా లెగ్ స్పిన్నర్ రవి బిష్ణోయ్‌కు బదులుగా కుల్దీప్ యాదవ్ మ్యాచ్ ఆడేందుకు సిద్ధంగా ఉన్నాడు. పేస్ విభాగంలోనూ మార్పు అవసరం అనుకుంటే ముకేశ్‌ను పక్కన పెట్టి టీమ్ మేనేజ్‌మెంట్ అవేశ్‌కు చాన్స్ ఇవ్వవచ్చు. మరో వైపు అఫ్గనిస్తాన్ మరో సారి తమ స్పిన్‌నే బలంగా నమ్ముకుంటోంది. ముజీబ్, నబీలు కొనసాగనుండగా ముగ్గురు పేసర్లు ఫజల్, నవీన్, గుల్బదిన్‌లు భారత్ బలమైన బ్యాటింగ్ లైనప్‌ను ఎంత వరకు నిలువరిస్తారనేది చూడాలి. మిడిలార్డర్‌లో రహ్మత్ స్థానంలో దూకుడైన బ్యాటర్ అయిన హజ్రతుల్లా జట్టులోకి వస్తాడు. సంచలన ప్రదర్శనతో సిరీస్‌ను సమం చేయాలని అఫ్గన్ జట్టు భావిస్తోంది.

## భారత్ పరాజయం



రాంచీ: మహిళల హాకీ ఒలింపిక్ క్వాలిఫయింగ్ టోర్నీని భారత జట్టు ఓటమితో మొదలు పెట్టింది. శనివారం జరిగిన తమ తొలి మ్యాచ్‌లో భారత్ 0-1 తేడాతో అమెరికా చేతిలో పరాజయంపాలైంది. అమెరికా తరఫున 16వ నిమిషంలో తామెర్ అబిగైల్ ఏకైక గోల్ నమోదు చేసింది. తొలి క్వార్టర్ హోరాహోరీ సాగి ఒక్క గోల్ కూడా నమోదు కాకపోగా, రెండో క్వార్టర్ ఆరంభంలోనే యూఎస్ ఆధిక్యంలోకి వెళ్లింది. ఆ తర్వాత భారత మహిళలు ఎన్ని ప్రయత్నాలు చేసినా స్కోరును సమం చేయలేకపోయారు. దురదృష్టవశాత్తూ ఆరు పెనాల్టీ అవకాశాలు వచ్చినా... ఒక్కదానిని కూడా గోల్‌గా మలచలేక భారత్ వృథా చేసుకుంది. నేడు జరిగే తమ తర్వాతి మ్యాచ్‌లో న్యూజిలాండ్‌తో భారత్ తలపడుతుంది.

## జైపూర్ పాంథర్స్ గెలుపు

జైపూర్: సొంతగడ్డపై జైపూర్ పింక్ పాంథర్స్ వరుసగా రెండో విజయంతో సత్తా చాటింది. ప్రొ కబడ్డీ లీగ్‌లో భాగంగా శనివారం జరిగిన మ్యాచ్‌లో జైపూర్ 36-34 స్కోరుతో పుణేరీ పల్టన్‌ను ఓడించింది. జైపూర్ తరఫున కెప్టెన్ అర్జున్ దేశ్వాల్ 16 పాయింట్లతో చెలరేగాడు. పుణేరీ ఆటగాళ్లలో కెప్టెన్ అస్లామ్ ముస్తఫా 8 పాయింట్లతో టాప్ స్కోరర్‌గా నిలిచాడు.

### పాయింట్ల పట్టిక (PKL)

| జట్టు | ఆ | గె | ఓ | టై | పా |
|---|---|---|---|---|---|
| పుణేరి పల్టన్ | 12 | 10 | 2 | 0 | 52 |
| జైపూర్ పింక్ పాంథర్స్ | 12 | 8 | 2 | 2 | 48 |
| దబంగ్ ఢిల్లీ | 11 | 7 | 3 | 1 | 40 |
| గుజరాత్ జెయింట్స్ | 12 | 7 | 5 | 0 | 39 |
| యు ముంబా | 11 | 6 | 4 | 1 | 35 |
| హరియాణా స్టీలర్స్ | 11 | 6 | 4 | 1 | 34 |
| బెంగళూరు బుల్స్ | 12 | 5 | 7 | 0 | 31 |
| పట్నా పైరేట్స్ | 11 | 5 | 6 | 0 | 29 |
| బెంగాల్ వారియర్స్ | 11 | 4 | 5 | 2 | 28 |
| యూపీ యోధాస్ | 12 | 3 | 8 | 1 | 21 |
| తమిళ్ తలైవాస్ | 11 | 3 | 8 | 0 | 19 |
| తెలుగు టైటాన్స్ | 12 | 1 | 11 | 0 | 10 |

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు

# ఆసీస్ చేతిలో భారత్ ఓటమి

ఆసియాన్ కప్ ఫుట్‌బాల్



ఇర్విన్

దోహా (ఖతర్): ఆసియాన్ కప్ ఫుట్‌బాల్ టోర్నీని భారత జట్టు పరాజయంతో ప్రారంభించింది. శనివారం జరిగిన మ్యాచ్‌లో ఆస్ట్రేలియా 2-0 గోల్స్ తేడాతో భారత్‌ను ఓడించింది. ఆసీస్ తరఫున 50వ నిమిషంలో జాక్సన్ ఇర్విన్, 73వ నిమిషంలో జోర్డాన్ బాస్ గోల్స్ సాధించారు. ఆసీస్ ఆటను దూకుడుగా ప్రారంభించింది. ఆరంభంలోనే అజీజ్ బెహిచ్ కొట్టిన షాట్ గోల్ పోస్ట్‌కు దూరంగా వెళ్లిపోగా, గుడ్‌విన్ ఇచ్చిన ఫ్రీకిక్‌ను హెడర్‌తో గోల్ చేయడంలో డ్యూక్ విఫలమయ్యాడు. 16వ నిమిషంలో భారత్‌కు గోల్ చేసేందుకు మంచి అవకాశం లభించింది. నిఖిల్ పుజారి క్రాసింగ్ పాస్ అందించగా, కెప్టెన్ సునీల్ ఛెత్రి దానిని గోల్‌గా మలచడంలో విఫలమయ్యాడు. తొలి అర్ధ భాగంలో ఆసీస్‌ను నిలువరించడంలో భారత గోల్‌కీపర్ గుర్‌ప్రీత్ సింగ్ సఫలమయ్యాడు. తమకు లభించిన 11 కార్నర్ కిక్‌లలో ఆసీస్ సఫలం కాలేదు. అయితే రెండో అర్ధభాగం ప్రారంభమైన కొద్ది సేపటికే ఆస్ట్రేలియా పైచేయి సాధించింది. మార్టిన్ బాయెల్ కొట్టిన షాట్‌ను గుర్‌ప్రీత్ ఆపగలిగినా...అక్కడే ఉన్న ఇర్విన్ దానిని గోల్‌గా మలిచాడు. 69వ నిమిషంలో కూడా గోల్ చేసేందుకు చేరువైన భారత్ మళ్లీ విఫలమైంది. స్కోరు సమం చేసేందుకు ఎంత ప్రయత్నించినా లాభం లేకపోయింది. కొద్ది సేపటికే సుభాషిష్ బోస్‌ను తప్పించి ర్యాన్ మెక్‌గ్రీ బంతితో దూసుకెళ్లగా...పోస్ట్‌కు దగ్గరలోనే ఉన్న బాస్ దానిని అందుకొని సునాయాసంగా గోల్ సాధించాడు. తమ తర్వాతి మ్యాచ్‌లో గురువారం ఉజ్బెకిస్తాన్‌తో తలపడుతుంది.

# హైదరాబాద్ ఘన విజయం

ఇన్నింగ్స్, 81 పరుగులతో మేఘాలయ చిత్తు



మిలింద్

షిల్లాంగ్: రంజీ ట్రోఫీ 'ప్లేట్' గ్రూప్‌లో హైదరాబాద్‌లో వరుసగా రెండో ఘన విజయాన్ని సొంతం చేసుకుంది. గత మ్యాచ్‌లాగే ఈ సారి కూడా రెండు రోజుల్లోనే ముగిసిన పోరులో హైదరాబాద్ జట్టు ఇన్నింగ్స్, 81 పరుగుల తేడాతో మేఘాలయను చిత్తు చేసింది. ఓవర్‌నైట్ స్కోరు 182/4తో శనివారం ఆట కొనసాగించిన హైదరాబాద్ తమ తొలి ఇన్నింగ్స్‌ను 7 వికెట్ల నష్టానికి 346 పరుగుల వద్ద డిక్లేర్ చేసింది. రోహిత్ రాయుడు (216 బంతుల్లో 124 నాటౌట్; 12 ఫోర్లు, 3 సిక్స్‌లు) సెంచరీ పూర్తి చేసుకోగా, దూకుడుగా ఆడిన సీవీ మిలింద్ (38 బంతుల్లో 50 నాటౌట్; 8 ఫోర్లు, 1 సిక్స్) అర్ధ సెంచరీ సాధించాడు. హైదరాబాద్‌కు 235 పరుగుల భారీ ఆధిక్యం లభించింది. అనంతరం మేఘాలయ తమ రెండో ఇన్నింగ్స్‌లో 36.1 ఓవర్లలో 154 పరుగులకే కుప్పకూలింది. జస్కిరత్ సింగ్ (53), కిషన్ లింగ్డో (47) రాణించారు. తనయ్ త్యాగరాజన్ 3 వికెట్లు పడగొట్టగా...రవితేజ, మిలింద్ చెరో 2 వికెట్లు తీశారు.

## ఆంధ్ర 98/3

ముంబై: 'ఎలైట్' డివిజన్‌లో భాగంగా ముంబైతో జరుగుతున్న మ్యాచ్‌లో ఆంధ్ర తడబడింది. రెండో రోజు ఆట ముగిసే సమయానికి ఆంధ్ర తమ తొలి ఇన్నింగ్స్‌లో 3 వికెట్లు కోల్పోయి 98 పరుగులు చేసింది. జ్ఞానేశ్వర్ (23), విహారి (6), షేక్ రషీద్ (3) వెనుదిరగ్గా...ప్రశాంత్ కుమార్ (59 నాటౌట్), రికీ భుయ్ (4 నాటౌట్) క్రీజ్‌లో ఉన్నారు. అంతకు ముందు 281/6తో ఆట కొనసాగించిన ముంబై తమ మొదటి ఇన్నింగ్స్‌లో 395 పరుగులకు ఆలౌటైంది. తనుష్ కొటియన్ (54), మోహిత్ అవస్థి (53) అర్ధ సెంచరీలు చేశారు. ఆంధ్ర బౌలర్లలో నితీశ్ కుమార్ రెడ్డి 5 వికెట్లు పడగొట్టగా...షోయబ్, లలిత్ చెరో 2 వికెట్లు తీశారు. ప్రస్తుతం ఆంధ్ర మరో 297 పరుగులు వెనుకబడి ఉంది.


# ఒలింపిక్ బెర్త్ నంబర్ 17

- షూటర్ విజయ్‌వీర్‌కు రజతం
- ఆసియా ఒలింపిక్ క్వాలిఫయింగ్



జకార్తా: పారిస్ ఒలింపిక్స్ షూటింగ్ విభాగంలో భారత్‌నుంచి మరో బెర్త్ ఖాయమైంది. పురుషుల 25 మీటర్ల ర్యాపిడ్ ఫైర్ ఈవెంట్‌లో విజయ్‌వీర్ సిద్ధూ ఈ కోటాను ఖాయం చేశాడు. దీంతో భారత్ నుంచి పాల్గొనే షూటర్ల సంఖ్య 17కు పెరిగింది. ఆసియా ఒలింపిక్ క్వాలిఫయర్స్ టోర్నీలో విజయ్‌వీర్ శనివారం రజత పతకం గెలుచుకున్నాడు. అయితే పతకం గెలుచుకోవడానికి ముందే అతనికి ఒలింపిక్ బెర్త్ ఖాయమైంది. క్వాలిఫయింగ్ దశలో 577 పాయింట్లు సాధించిన విజయ్‌వీర్ నాలుగో స్థానంలో నిలిచాడు. ఫైనల్‌కు చేరిన ఆరు గురిలో నలుగురికి ఒలింపిక్స్‌కు అర్హత సాధించే అవకాశం ఉండగా అతనికి ఈ చాన్స్ లభించింది. చండీగఢ్‌కు చెందిన 21 ఏళ్ల వీర్ గత ఏడాది హాంగ్జౌ ఆసియా క్రీడల్లో కాంస్యం సాధించాడు. మరో వైపు మహిళల 50 మీటర్ల రైఫిల్ త్రీ పొజిషన్స్ వ్యక్తిగత విభాగంలో భారత్‌కు 2 పతకాలు లభించాయి. ఈ ఈవెంట్‌లో సిఫ్ట్‌కౌర్ రజతం గెలుచుకోగా, ఆషి చౌక్సీకి కాంస్యం దక్కింది.

# సినిమా





● సన్నీ డియోల్

## లోహ్రీ రోజు దానం చేయాలి


- అమితాబ్ బచ్చన్

సంక్రాంతి పండగ సంబరాలు ఆరంభమయ్యాయి. కొందరు బాలీవుడ్ స్టార్స్ సోషల్ మీడియా వేదికగా శుభాకాంక్షలు తెలిపారు.

''అందరికీ లోహ్రీ (భోగి పండగ) శుభాకాంక్షలు. లోహ్రీ అంటే నాకు చాలా విషయాలు గుర్తుకొస్తాయి. లోహ్రీ రోజు జానపద కళాకారులు 'లోహ్రీ దా టక్కా దే, రబ్ యానూ బచ్చా దే' అంటూ పాటలు పాడుకుంటూ ఇంటింటికీ వచ్చినప్పుడు వారికి దానం ఇవ్వడం ఆనవాయితీ. నా చిన్నప్పుడు మా అమ్మగారు ఇలా పండగ తాలూకు విషయాలు చెప్పేవారు'' అని సోషల్ మీడియా ద్వారా అమితాబ్ బచ్చన్ షేర్ చేశారు.

''లోహ్రీ తాలూకు వెచ్చదనాన్ని, పండగ సందర్భంగా మా అమ్మగారు చేసిన స్వీట్స్‌ని తలుచుకుంటున్నాను. ఇరుగు పొరుగుతో పంచుకున్న నవ్వులతో నా మనసు నిండిపోయేది. నేటి బిజీ జీవితంలో అప్పటి ఆనందకర సాధారణ రోజులను తలచుకుని, ఆనందిస్తున్నాను. అందరి జీవితాల్లో లోహ్రీ ఆనందం నింపాలని కోరుకుంటున్నా'' అని సన్నీ డియోల్ పేర్కొన్నారు. ఇంకా అక్షయ్ కుమార్, సంజయ్ దత్, విక్కీ కౌశల్, ఇషా డియోల్, నేహా ధూపియా వంటి తారలు సోషల్ మీడియా వేదికగా శుభాకాంక్షలు తెలిపారు.

## టార్గెట్ ఫిక్స్



● అల్లు అర్జున్

టార్గెట్ ఫిక్స్ చేశాడు పుష్పరాజ్. హీరో అల్లు అర్జున్, దర్శకుడు సుకుమార్ కలయికలో రూపొందుతున్న తాజా చిత్రం 'పుష్ప'. ఈ సినిమా తొలి భాగం 'పుష్ప: రైజ్' ఘనవిజయం సాధించడంతో, మలి భాగం 'పుష్ప: ది రూల్'పై భారీ అంచనాలు నెలకొన్నాయి. ప్రస్తుతం ఈ చిత్రం షూటింగ్‌తో బిజీగా ఉన్నారు అల్లు అర్జున్, సుకుమార్. యాభై శాతానికి పైగా సినిమా పూర్తయింది. బ్యాలెన్స్ షూటింగ్‌ను మే నెలాఖరుకల్లా పూర్తి చేసేలా టార్గెట్ ఫిక్స్ చేసుకుని, అందుకు అనుగుణంగా సుకుమార్ షూటింగ్ ప్లాన్ సిద్ధం చేశారని సమాచారం. వీలైనంత త్వరగా షూటింగ్ పూర్తి చేసి, ఈ సినిమా వీఎఫ్‌ఎక్స్, ఎడిటింగ్ వర్క్స్‌పై మరింత ఫోకస్ పెట్టాలని సుకుమార్ భావిస్తున్నారట. 'పుష్ప' సినిమాలో పుష్పరాజ్ పాత్రలో నటిస్తున్న అల్లు అర్జున్‌కు జోడీగా శ్రీవల్లి పాత్రలో రష్మికా మందన్నా నటిస్తున్నారు. ఫాహద్ ఫాజిల్, జగపతిబాబు కీలక పాత్రల్లో నటిస్తున్న ఈ సినిమాకు దేవీశ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్ నిర్మిస్తున్న ఈ చిత్రం ఆగస్టు 15న విడుదల కానుంది.

## బాగుండే ఏ సినిమానీ ఎవరూ ఆపలేరు

- నిర్మాత 'దిల్' రాజు



● నాగవంశీ, 'దిల్' రాజు

''ఇండస్ట్రీలో ఎవరికి ఎవరూ శత్రువులు కాదు.. మిత్రులు కాదు. సినిమా అంటే వ్యాపారం. వ్యాపార కోణంలో కొన్ని సమీకరణాలు ఉంటాయి. ప్రతి సంక్రాంతికి మా మధ్య వార్స్ జరగడం సాధారణమే. అయితే బాగుండే ఏ సినిమానీ ఎవరూ ఆపలేరు'' అని నిర్మాత 'దిల్' రాజు అన్నారు. మహేశ్‌బాబు హీరోగా నటించిన చిత్రం 'గుంటూరు కారం'. శ్రీలీల హీరోయిన్‌గా నటించిన ఈ సినిమాలో మీనాక్షీ చౌదరి, రమ్యకృష్ణ, ప్రకాశ్‌రాజ్, జయరాం కీలక పాత్రలు పోషించారు. సూర్యదేవర రాధాకృష్ణ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 12న విడుదలైంది. ఈ సందర్భంగా శనివారం జరిగిన ఈ సినిమా విలేకర్ల సమావేశంలో నిర్మాత, పంపిణీదారుడు 'దిల్' రాజు మాట్లాడుతూ– ''గుంటూరు కారం' నైట్ షోలకు కాస్త నెగటివ్ టాక్ వచ్చింది. కానీ షో బై షో పాజిటివ్‌గా మారుతోంది. సినిమాలో మహేశ్‌బాబుగారి క్యారెక్టరైజేషన్ బాగుంది. తల్లీకొడుకుల ఎమోషనల్ అండ్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ మూవీ 'గుంటూరు కారం'. నేను థియేటర్‌లో సినిమా చూశాను. ప్రేక్షకులు ఎంజాయ్ చేస్తున్నారు. 'బాగోలేదంట' అనే టాక్ విని ప్రేక్షకులు ఆ సినిమాకు వెళ్లి, చూసిన తర్వాత అవి బ్లాక్‌బస్టర్స్ అయిన సినిమాలు కొన్ని ఉన్నాయి. ఓ సినిమాకు ఉన్న నెగటివ్ టాక్స్ కలెక్షన్స్ చూసిన తర్వాతే పోతాయి. ఫైనల్ నంబర్స్‌ని పండగ తర్వాత చెబుతాం'' అన్నారు. ''ఈ పండక్కి ఫ్యామిలీతో కలిసి థియేటర్స్‌లో 'గుంటూరు కారం' చూడండి. ప్రేక్షకులు ఎంటర్‌టైన్ అవుతారన్న గ్యారంటీ నాది'' అన్నారు సూర్యదేవర నాగవంశీ.

## ఆస్కార్ లైబ్రరీలో జోరమ్



● 'జోరమ్'లో మనోజ్ బాజ్‌పాయ్

హిందీ చిత్రం 'జోరమ్' చరిత్ర సృష్టించింది. ప్రతిష్ఠాత్మకమైన ఆస్కార్ లైబ్రరీలో ఈ సినిమాకు చోటు దక్కింది. దేవాశిష్ మఖిజా దర్శకత్వంలో మనోజ్ బాజ్‌పాయ్, మొహమ్మద్ జీషన్ అయ్యూబ్, తన్నిష్ఠ ఛటర్జీ ప్రధాన పాత్రధారులుగా ఈ సినిమా రూపొందింది. జీ స్టూడియోస్, మఖిజా ఫిలింస్ ఈ సినిమాను నిర్మించాయి. గత ఏడాది ఫిబ్రవరిలో జరిగిన రోటర్‌డామ్ ఇంటర్‌నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్, జూన్‌లో సిడ్నీ ఫిల్మ్ ఫెస్టివల్, జులైలో దర్బన్ ఫిల్మ్ ఫెస్టివల్, అక్టోబరులో 28వ బూసాన్ ఇంటర్‌నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్, 59వ చికాగో ఫిల్మ్ ఫెస్టివల్‌లో ఈ సినిమా ప్రదర్శితమైంది. థియేటర్స్‌లో గత ఏడాది డిసెంబరు 8న విడుదలైంది. ఈ సినిమాకు విమర్శకుల ప్రశంసలు దక్కినప్పటికీ బాక్సాఫీస్ వద్ద మాత్రం మెరుగైన ఫలితం దక్కలేదు. అయితే తాజాగా ఈ సినిమా వందేళ్ల చరిత్ర ఉన్న ఆస్కార్ లైబ్రరీలో చోటు దక్కించుకుంది. ఈ విషయాన్ని 'ఎక్స్'లో షేర్ చేశారు మనోజ్ బాజ్‌పాయ్. ''నా చిత్రానికి ఇలాంటి గౌరవం దక్కడం సంతోషంగా ఉంది. ఇది యూనిట్ సమష్టి విజయం. మనం ఎంత చేయగలమో మనకే తెలుసు'' అని పేర్కొన్నారు మనోజ్. ఇక ఈ చిత్రకథ విషయానికి వస్తే.. తన కుమార్తె ప్రాణాలను కాపాడటం కోసం ఓ తండ్రి చేసే పోరాటం నేపథ్యంలో సాగే సర్వైవల్ డ్రామాగా 'జోరమ్' తెరకెక్కింది. 2016లో 'తాండవ్' షార్ట్ ఫిల్మ్, 2020 జూన్‌లో 'భోంస్లే' (ఇండియా రిలీజ్) చిత్రాల తర్వాత హీరో మనోజ్ బాజ్‌పాయ్, దర్శకుడు దేవాశిష్ మఖిజా కాంబినేషన్‌లో రూపొందిన మూడో చిత్రం 'జోరమ్'.

## ఆలియా అవుట్.. జాన్వీ ఇన్?



● ఆలియా భట్



● జాన్వీ కపూర్

హిందీలో 'దుల్హనియా' ఫ్రాంచైజీలో వచ్చిన 'హంప్టీ శర్మా కీ దుల్హనియా', 'బద్రీనాథ్ కీ దుల్హనియా' చిత్రాల్లో వరుణ్ ధావన్, ఆలియా భట్ హీరో హీరోయిన్లుగా నటించారు. ఈ చిత్రాలకు శశాంక్ కేతన్ దర్శకత్వం వహించారు. తాజాగా ఈ ఫ్రాంచైజీలో మూడో భాగానికి కేతన్ ప్రయత్నాలు మొదలు పెట్టారని బాలీవుడ్ సమాచారం. వరుణ్ ధావన్, ఆలియా భట్‌లను కూడా సంప్రదించారట. అయితే వరుణ్ ధావన్ సుముఖంగానే ఉన్నా, ఇప్పటికే అంగీకరించిన చిత్రాల కారణంగా ఆలియా మాత్రం ఈ సినిమాలో నటించలేకపోతున్నారట. ఈ నేపథ్యంలో ఈ చాన్స్ జాన్వీ కపూర్‌కు వెళ్లిందట. ఈ సినిమాకు జాన్వీ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారని, ప్రీ ప్రొడక్షన్ వర్క్స్ ఊపందుకున్నాయని టాక్. వేసవిలో షూటింగ్ ఆరంభించాలనుకుంటున్నారని సమాచారం.

## ఐదు రోజులు గాల్లోనే ఉన్నాను

- తేజ సజ్జా



"ప్రతి యాక్టర్ కెరీర్‌లో ఓ బెంచ్ మార్క్ ఫిల్మ్ ఉంటుందంటుంటారు. నా కెరీర్‌లో 'హను-మాన్'ని నా బెంచ్ మార్క్ ఫిల్మ్‌గా ఫీలవుతున్నాను. ఈ సినిమా కోసం చాలా కష్టపడ్డాను. క్లైమాక్స్‌లో ఓ సన్నివేశం కోసం రోప్ సాయంతో ఐదు రోజులు గాల్లోనే ఉన్నాను. రెండున్నరేళ్లు ఏ సినిమా ఒప్పుకోలేదు. యాక్టర్‌గా నా కెరీర్ పరంగా, నా వయసు పరంగా ఈ రెండున్నరేళ్ల కాలం చాలా కీలకమైనది. 'హను-మాన్' సక్సెస్ కావడం సంతోషంగా ఉంది" అని తేజ సజ్జా అన్నారు. తేజ సజ్జా హీరోగా ప్రశాంత్ వర్మ దర్శకత్వంలో రూపొందిన సినిమా 'హను-మాన్'. కె. నిరంజన్ రెడ్డి నిర్మించిన ఈ సినిమా ఈ నెల 12న విడుదలైంది. 'హను-మాన్'కి ప్రేక్షకుల నుంచి మంచి స్పందన వస్తోందని చెబుతూ, శనివారం జరిగిన విలేకర్ల సమావేశంలో తేజ సజ్జా పంచుకున్న విశేషాలు.

● తెలుగుతో పాటు హిందీ, కన్నడ వంటి భాషల్లో కూడా 'హను-మాన్' బాగా ఆడుతున్నందుకు సంతోషంగా ఉంది. గత ఏడాది నుంచి ఇప్పటివరకు ఏ తెలుగు సినిమాకీ రానంత స్పందన ఈ సినిమాకు హిందీలో వస్తోందని చెబుతున్నారు. మా సినిమాకు కాస్త సింపతీ వర్కౌట్ అయ్యిందని అనడం కరెక్ట్ కాదు. ఎందుకంటే మా సినిమా ట్రైలర్, టీజర్ చూసి హిందీ, కన్నడవారు మమ్మల్ని అడిగి సినిమా తీసుకున్నారు. ఏం జరిగినా అంతిమంగా సినిమానే మాట్లాడుతుంది. సినిమానే నిలబడుతుంది. నిర్మాత నిరంజన్‌రెడ్డిగారు, ప్రశాంత్‌వర్మ 'హను-మాన్' సినిమాను బాగా చేశారు.

● 'హను-మాన్' సినిమా సమయంలో నేను ఇతర సినిమాలు ఒప్పుకోకపోవడానికి కారణం ఆ సినిమాల ఇంపాక్ట్ 'హను-మాన్'పై పడకూడదని. ఈ సినిమా సక్సెస్ మా అందరిదీ. ఈ సినిమా యూనిట్ సభ్యులు వారి వారి డిపార్ట్‌మెంట్స్‌లోనే కాక, ఇతర క్రాఫ్ట్స్‌లో కూడా కలుగజేసుకుని బాధ్యతగా చేశారు. ఉదాహరణకు నా లుక్‌లోని కొన్ని కాస్ట్యూమ్స్‌కు మా సినిమా ఆర్ట్ డైరెక్టర్ వర్క్ చేశారు. ఈ సినిమా విషయంలో మొదట్నుంచి ఏదో ఆధ్యాత్మిక శక్తి మమ్మల్ని ముందుకు నడిపిందని నా నమ్మకం. 'హను-మాన్' సినిమాను మేం చేయలేదు. 'హను-మాన్' సినిమా మా చేత చేయబడింది. ఈ సినిమాకు లాంగ్ రన్ ఉంటుందని మేం అనుకుంటున్నాం.

● 'హను-మాన్' సినిమాలోని హనుమంతుని విగ్రహం సినిమాకు ఆకర్షణగా నిలిచింది. గ్రాఫిక్స్ అలా చేయడానికి ఆరు నెలల సమయం పట్టింది. క్లైమాక్స్ చిత్రీకరణకు 60 రోజులకు పైగా సమయం పట్టింది. 'హను-మాన్' ప్రాజెక్ట్ గురించి చిరంజీవిగారికి తెలుసు. ఈ సినిమాలోని హనుమంతుని పాత్ర గురించి ఆయనకు తెలుసు. మా ఇంటెన్షన్ హనుమంతుని పాత్రలో చిరంజీవిగారు అనే. ఆ సంగతి అలా ఉంచితే చిరంజీవిగారు ఇంకా 'హను-మాన్' సినిమా చూడలేదు. అయితే రిలీజైన రోజున శుభాకాంక్షలు చెబుతూ మెసేజ్ పంపారు.